సాక్షి
బాపట్ల
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



డీ వార్మింగ్‌డే పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: ఈనెల 9న జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్, అధికారులు పోస్టర్ ఆవిష్కరించారు.



యంత్ర పరికరాలపై అవగాహన

బాపట్ల: వ్యవసాయ యంత్ర పరికరాలపై అవగాహన అవసరమని అగ్రి ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ డీడీ స్మిత్ పేర్కొన్నారు. రెండురోజుల పాటు జరిగిన శిక్షణ బుధవారంతో ముగిసింది.



గోరుముద్ద నాణ్యత పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: కోబాల్డ్‌పేటలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఉర్దూ డీఐ పేక్ ఎండీ ఖాసిం తనిఖీ చేసి, జగనన్న గోరుముద్ద నాణ్యతను పరిశీలించారు.

న్యూస్‌రీల్

అయోధ్యకు ప్రత్యేక రైలు ప్రారంభం



గుంటూరు మెడికల్: అయోధ్యలోని బాలరాముని ఆలయం దర్శనార్థం గుంటూరు నుంచి రామభక్తులతో బయల్దేరిన అయోధ్య ప్రత్యేక రైలును బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, శివస్వామిజీ జెండా ఊపి ప్రారంభించారు. పురందేశ్వరి మాట్లాడుతూ ఏపీ నుంచి అయోధ్యకు వెళ్తున్న తొలి రైలు అని చెప్పారు. భక్తులు బాలరాముని దర్శనం కోసం వెళుతుంటే చూడాలని మాత్రమే వచ్చానన్నారు. 500 ఏళ్ల తర్వాత అయోధ్యలో ప్రతిష్ఠ జరగడం చూస్తే ఆనందంగా ఉందని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు పునర్వైభవం సంతరించుకోవడానికి ప్రధాని నరేంద్రమోదీ త్యాగ ఫలితమేనని వెల్లడించారు. శ్రీరాముని చల్లని చూపు ఏపీపై ఉండాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర ఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, రామకృష్ణారెడ్డి, జూపూడి రంగరాజు, యడ్లపాటి స్వరూపరాణి, శనక్కాయల అరుణ పాల్గొన్నారు.

ఐఏఎస్‌ల కమిటీ నియామకంపై సీఎంకు కృతజ్ఞతలు

తాడేపల్లిరూరల్: ఎస్సీ అండ్ ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్ల సమీక్ష కోసం ఐఏఎస్‌ల కమిటీని నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో రోస్టర్, ప్రమోషన్లలో రిజర్వేషన్ల సమీక్ష కోసం గతంలో నియమించిన మిడిల్ లెవల్ ఆఫీసర్స్ కమిటీకి బదులు ఆ స్థానంలో ఏడుగురు సభ్యులతో కూడిన ఐఏఎస్‌ల కమిటీని నియమించడం ఎంతో హర్షణీయమని, ఇటీవల ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌లకు తమ సమస్యలను విన్నవించామని, వాటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి వారు కృషి చేశారని ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆ ప్రకటనలో తెలిపారు.

వైకుంఠపురం హుండీ ఆదాయం రూ.40.54 లక్షలు



తెనాలి: పట్టణంలోని వైకుంఠపురంలో వేంచేసియున్న లక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీల లెక్కింపును బుధవారం నిర్వహించారు. స్థానిక సీతారామస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.అమరనాథ్ సమక్షంలో జరిగిన ఈ లెక్కింపులో 51.600 గ్రాముల బంగారం, 321 గ్రాముల వెండి, రూ.40,54,922 నగదు వచ్చిందని అధికారులు తెలియజేశారు. వైకుంఠపురం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్, యూనియన్ బ్యాంక్, తెనాలి సిబ్బంది, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారని ఆలయ ఈఓ ఎం.తిమ్మానాయుడు వివరించారు.

యార్డుకు 1,30,662 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,662 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,26,797 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 21,800 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 87,688 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

తీపి కబురు గురు

నిరుద్యోగుల్లో మెగా డీఎస్సీ జోష్




నిరుద్యోగులకు వరం



జె. పంగులూరు: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్ నిరుద్యోగులకు వరం వంటిది. మాది బాపట్ల జిల్లా జె.పంగులూరు. నా పేరు మేకా వెంకటేశ్వర్లు. నేను గతంలో పీఈటీ ట్రైనింగ్ పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురు చూశాను. అయితే 2008 నుంచి 2018 వరకు వేసిన డీఎస్సీల్లో పీఈటీ పోస్టులు లేవు. ఇప్పుడు ఈ డీఎస్సీల్లో పీఈటీకి సంబంధించి 68 పోస్టులు ప్రకటించారు. చాలా రకాలైన ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయి. చాలా ఆనందంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- భారీ స్థాయిలో పోస్టులు ఉండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు
- ఇప్పటికే గ్రూప్–1, గ్రూప్–2, సచివాలయ పోస్టుల భర్తీతో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న అభ్యర్థులు

సాక్షి, నరసరావుపేట: ఉపాధ్యాయ పోస్టులకు కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం తీపికబురు చెప్పింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల 12వ తేదీ నుంచి భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 7వ తేదీన ఫలితాలు రానున్నాయి. ఉపాధ్యాయ పోస్టులకు అర్హతగా భావించే టెట్ ప్రక్రియ నేటి నుంచే ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు ఏపీ టెట్ పరీక్షలు జరగనున్నాయి. మార్చి 14న టెట్ ఫలితాలు విడుదల కానున్నాయి. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి.



ఆనందోత్సాహాలు..

ఎన్నో రోజులుగా ఎదురుచూసిన నోటిఫికేషన్ విడుదలతో నిరుద్యోగ యువతలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీని విడుదల చేశారని ఉపాధ్యాయ పోస్టులకు ఎదురుచూస్తున్న అభ్యర్థులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మెగా డీఎస్సీలో జిల్లాల వారీగా ఎన్ని పోస్టులు ఉన్నాయి, అందులో తాము పోటీ పడుతున్న వాటిలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో లెక్కలు వేసుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన ఈ పోస్టుల భర్తీ ఉండనుంది. ఇప్పటికే విద్యాశాఖ ఖాళీల వివరాలను పంపింది. ఇందులో జిల్లా, మండల పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, గిరిజన సంక్షేమ శాఖ పోస్టులు ఉండనున్నాయి. పోస్టులు అధికసంఖ్యలో ఉండటం, పోటీ కూడా అదేస్థాయిలో ఉంటుండడంతో అభ్యర్థులు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం పలు దఫాలుగా గ్రూప్–1, గ్రూప్–2, గ్రామ, వార్డు సచివాలయ పోస్టులు పెద్ద ఎత్తున భర్తీ చేయడంతో యువతకు భారీగా ప్రభుత్వ ఉద్యోగావకాశాలు వచ్చాయి. ఇప్పుడు మరోసారి ఉపాధ్యాయ పోస్టులు భారీఎత్తున భర్తీ చేస్తుండడంపై నిరుద్యోగ యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు..

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంపై అత్యంత శ్రద్ధ చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ–2024 నోటిఫికేషన్ విడుదల చేయించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.థామస్‌రెడ్డి, జి.శేషసాయి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం అభినందనీయమని, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ప్రయోజనం చేకూర్చారని పేర్కొన్నారు.

హామీని నేరవేర్చిన సీఎం జగన్...



మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తానన్న హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారు. దీనివల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో పట్టుదలతో సిద్ధమవుతున్నాను. ఉద్యోగం పొందడానికి ఇది మంచి అవకాశం.

– మద్దు వినోద్ కుమార్, టెట్ క్వాలిఫైయర్, నందిగామ, సత్తెనపల్లి మండలం

ఉద్యోగం సాధించడానికి మంచి అవకాశం...



ఇంత పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడం సంతోషకరం. ఎన్నో ఏళ్లుగా కలలు కంటున్న టీచర్ పోస్టు సాధించడానికి ఇదే మంచి తరుణం. పోటీకూడా అదే స్థాయిలో ఉండనుండటంతో తీవ్రంగా కష్టపడుతున్నాను. ప్రభుత్వం ఇప్పటికే గ్రూప్స్, సచివాలయాల పేరిట నిరుద్యోగులకు మంచి అవకాశాలు కల్పించింది.

–మహేష్, డీఎస్సీ అభ్యర్థి, మాచర్ల

పట్టుదలతో సిద్ధమవుతున్నా...



ఉపాధ్యాయ పోస్టు కోసం ఎదురుచూస్తున్నాను. డీఎస్సీ రాసేందుకు అవసరమైన టెట్‌కు క్వాలిఫై అయ్యాను. మరోసారి టెట్ రాసి స్కోర్ పెంచుకోవడంతోపాటు డీఎస్సీలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తాను. ఎక్కువ సంఖ్యలో పోస్టులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– అన్నపురెడ్డి వెంకటరెడ్డి, టెట్ క్వాలిఫైయర్, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

పట్నంబజారు: శాశ్వత లోక్ అదాలత్(టీపీఎల్‌ఏపీయూఎస్) ద్వారా సత్వర న్యాయసహాయం లభిస్తుందని టీపీఎల్‌ఏపీయూఎస్ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్, లోక్ అదాలత్‌కు సంబంధించిన జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌తో బ్యాంకులు, ప్రజలకు త్వరగా ఖర్చు లేకుండా న్యాయం జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులు, సివిల్ కోర్టులో ఇచ్చిన డిక్రీతో సమానమని, ఆ తీర్పుకు అప్పీలు లేదని తెలిపారు. ఏవిధమైన సెక్యూరిటీ లేకుండా ఇచ్చి మొండి బకాయిగా ఉన్న రుణాలు రూ.కోటివరకు ఉన్నవాటిని శాశ్వత లోక్ అదాలత్ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ పి.వి.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకు అధికారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి టి.లీలావతి మాట్లాడుతూ మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో బ్యాంకర్లు 15 రోజుల ముందుగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూబీఐ డీజీఎం సయ్యద్ జవహర్, లీడ్ బ్యాంకు మేనేజర్ మణిపాల్‌రెడ్డి, శాశ్వత లోక్ అదాలత్ సభ్యుడు రామారావు, ఆయా బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బాసటకు ‘ఆసరా’

- వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- వేమూరులో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న వరికూటి అశోక్‌బాబు

వేమూరు: మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా పథకం ఒక వరం లాంటిదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల కేంద్రం వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కు పంపిణీ చేశారు. తొలుత దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలోని 992 గ్రూపుల మహిళలకు రూ 7.84 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నారన్నారు. అన్నిరంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధికి చిన్న తరహా కుటీర పరిశ్రమలకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు సబ్సిడీపై ప్రభుత్వం రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రుణాలు కావాల్సిన వారు క్రాంతి పథకం సిబ్బందికి వివరాలు అందజేయాలని ఆయన సూచించారు. గ్రామ సర్పంచ్ సజ్జా లక్ష్మీతిరుపతమ్మ, గొల్లపూడి లక్ష్మి, జడ్పీటీసీ గాజుల హేమలత, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, దాది సుబ్బారావు, మార్కెట్ యార్డు చైర్మన్ ఉప్పు శిరిషా కోగంటి లవకుమార్, వైఎస్సార్ క్రాంతి పథకం కో–ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, బెల్లం కొండ శివపార్వతి ,గాజుల ప్రకాశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనకే గ్రామదర్శిని

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేయడమే గ్రామదర్శిని ముఖ్య ఉద్దేశమని, ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వీడియో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించడానికే గ్రామ దర్శిని కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారులుగా 70 మందిని నియమించామన్నారు. ఈనెల 9వ తేదీన 70 గ్రామాలలో అధికారులు తనిఖీలు చేయాలన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు గ్రామ దర్శిని కార్యక్రమాన్ని చేపట్టగా, 1,245 సమస్యలు గుర్తించామన్నారు. అందులో 1000 సమస్యలు పరిష్కరించామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు జిల్లాకు 3,78,000 రాగా, 2.27 లక్షలు ఎందుకు పంపిణీ చేయలేదని అధికారులను కలెక్టర్ రంజిత్ బాషా నిలదీశారు. కుల గణన సర్వే ప్రక్రియ రాష్ట్రమంతా 90 శాతం పూర్తికాగా, జిల్లాలోని సంతమాగులూరులో 85 శాతం, కొరిశపాడులో 86% పురోగతి ఏమిటని నిలదీశారు. జగనన్న కాలనీలలో 899 గృహ నిర్మాణాలు తుది దశకు చేరాయని కలెక్టర్ చెప్పారు. స్వయం సహాయక సంఘాలలోని 1,201 మంది మహిళలకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ లందరూ తమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదిక పంపాలన్నారు. రేపల్లె ఆర్డీఓ హెలా షారోన్, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎస్.విజయమ్మ, డ్వామా పీడీ బి.అర్జున్ రావు, పీఆర్ఎస్ఈ హరేరామకృష్ణ పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్‌పై మార్గదర్శకాలు విడుదల..

బాపట్ల: హోమ్ ఓటింగ్ విధానం ప్రవేశ పెట్టడానికి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. రాజకీయపార్టీ నాయకులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ఇందుకోసం అధికారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. దివ్యాంగులు, 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు తమ ఓటు హక్కు ఇంటి వద్దనే వినియోగించుకోవడానికి నూతన విధానం ఎంతో ఉపకరిస్తుందన్నారు. సవరణ ఓటర్ల జాబితా ఎన్నికల సమయానికి సిద్ధం చేస్తామన్నారు. ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన జనవరి 22వ తేదీ నుంచి ఇప్పటివరకు 13,855 దరఖాస్తులు వచ్చాయన్నారు. జీవనోపాధి కోసం తాత్కాలికంగా విదేశాలకు వెళ్లిన ఓటర్లను ఓవర్సీస్ ఓటర్లుగా నమోదు చేశామన్నారు. ఓవర్సీస్ ఓటర్లు పర్చూరు నియోజకవర్గంలో 345 ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని నియోజకవర్గాలకు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలను మార్చినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ పి.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

అర్జీలను సత్వరం పరిష్కరించండి..

పర్చూరు(చినగంజాం): ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను అధికారులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. డ్రైనేజీ, రోడ్లు, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర సమస్యలకు సంబంధించిన అర్జీలను ఆయన స్వయంగా స్వీకరించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు అందజేసి సూచనలు చేశారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు ఇనాం భూములకు పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో జిల్లా రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకొని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. జేసీ శ్రీధర్, ఆర్డీఓ జి.రవీందర్, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, సంధ్యశ్రీ, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మూడేళ్లలోనే చిత్తశుద్ధి

తెనాలిలో ట్రయల్‌రన్‌కు సిద్ధమైన మురుగునీటి శుద్ధి ప్లాంట్

- రూ.30 కోట్లతో మూడేళ్లలో నిర్మాణం
- రోజుకు కోటి లీటర్ల మురుగునీటి శుద్ధి సామర్థ్యం
- 4,500 ఎకరాల పంటభూములకు శుద్ధి చేసిన నీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పూలే కాలనీలోని మురుగునీటి శుద్ధి ప్లాంట్



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి పట్టణ పూలే కాలనీలో రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. రోజుల వ్యవధిలోనే ట్రయల్‌రన్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. కేవలం మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ భారీ ప్రాజెక్టుకు రోజుకు కోటి లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. పట్టణంలో మురుగునీటి బెడద తీరటమే కాకుండా, ఆ నీటితో నాలుగున్నర వేల ఎకరాల భూములకు సాగునీరు అందించనున్నారు.

రూ.30కోట్ల వ్యయంతో ప్రాజెక్టు..

పట్టణాల్లో మురుగునీటిని శుద్ధి చేసి తగిన అవసరాలకు వినియోగించాలన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గైడ్‌లైన్స్ ఈ ప్రాజెక్టుకు దారితీశాయి. రాష్ట్రంలోని వివిధ పట్టణాలతోపాటు తెనాలిలోనూ ఈ ప్రాజెక్టుకు అనుమతి లభించింది. పూలే కాలనీలో ఏనాడో మూలనపడ్డ మున్సిపాలిటీ మురుగునీటి శుద్ధిప్లాంటుకు గల స్థలంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.30 కోట్ల వ్యయంతో తాజా ప్లాంటును చేపట్టారు. పట్టణం నడిబొడ్డులోని పెదరావూరు–వీస్సార్ కాలేజీ రోడ్డుకు తూర్పువైపున గల ఏరియా మొత్తాన్ని అంటే పట్టణ సగభాగాన్ని జోన్–1గా విభజించారు. ఆ ప్రాంతంలోని మురుగునీటి శుద్ధి కోసం ఈ ప్లాంటును నిర్మించారు. ముంబయికి చెందిన ఖిలారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన ఈ ప్లాంట్ నిర్మాణం పనులు కరోనా మహమ్మారి కారణంగా ఆలస్యం జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక శ్రద్ధతో గత మూడేళ్ల వ్యవధిలోనే ఈ భారీ ప్రాజెక్టును ట్రయల్‌రన్‌కు సంసిద్ధం చేస్తున్నారు. స్థానిక రామలింగేశ్వరపేట నుంచి వెళ్లే జంపని డ్రెయిన్‌కు ఈ ప్లాంట్‌ను అనుసంధానం చేశారు.

ప్లాంటు పనితీరు ఇలా..

ప్లాంటు పనితీరులోకి వెళితే, డ్రెయినులోంచి వచ్చే మురుగునీరు ఇన్‌లెట్ చాంబర్‌తో పంప్‌హౌస్‌లోకి వెళతాయి. 30 మి.మీకు పైబడిన రాళ్లు, ఇతర చెత్తాచెదారం చాంబర్‌లోనే ఆగిపోతాయి. పంప్‌హౌస్‌నుంచి ఎస్‌బీఆర్ బేసిన్స్‌లోకి వెళ్లాక మురుగునీటి శుద్ధి జరుగుతుంది. తర్వాత లేబొరేటరీలో పరీక్షలు జరిపి, కాలుష్య నియంత్రణ మండలి సూచించిన పరిమితుల ప్రకారం ఉందని నిర్ధారించుకున్నాక సాగునీటి కాల్వలోకి ఈ నీటిని విడుదల చేస్తారు. శుద్ధి చేసే క్రమంలో వచ్చే ఘనవ్యర్థం వేరొక ట్యాంకులోకి వెళుతుంది. ఈ వ్యర్థాన్ని మున్సిపాలిటీ ఎరువుగా నర్సరీలకు విక్రయించవచ్చని ప్రాజెక్ట్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు.

శుద్ధి చేసిన నీళ్లు పంటపొలాలకు..

నగరాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా శుద్ధిచేసిన నీటిని గార్డెన్స్‌కు, హోటల్స్‌కు, రైల్వే వాగన్ల శుభ్రతకు సంబంధిత కార్పొరేషన్లు విక్రయిస్తుంటాయి. తెనాలిలో సాగునీటి ఆవశ్యకత ఉన్నందున ఈ నీటిని మున్సిపాలిటీ పంటపొలాలకు విడుదల చేస్తారు. జోన్–1లో 2048 నాటికి 2.50 లక్షల జనాభా ఉంటుందన్న అంచనాతో రోజుకు కోటి లీటర్ల మురుగునీటి శుద్ధి కోసం ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ప్రస్తుతం రోజుకు 30 లక్షల లీటర్ల మురుగునీరు వస్తున్నాయని అధికారుల అంచనా. ఈ ప్రాజెక్టు కోసం సమీప ప్రాంత రైతులు వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

నిజాంపట్నం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ నుంచి 30 మంది క్రీడాకారులు వెళ్లినట్లు రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి కె వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులను బుధవారం నిజాంపట్నంలో ఆయన అభినందించి మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 12 వరకు రాజస్థాన్‌లోని జయపూర్‌లో జాతీయస్థాయి తైక్వాండో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా వారిలో భాదిధర్మ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుంచి నలుగురు క్రీడాకారులు సబ్ జూనియర్ విభాగంలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన నలుగురు క్రీడాకారులు కార్తికేయ, రిషిక్, ప్రేమ్‌చందు, పీతా నాగ తనూషలను వెంకటేశ్వరరావు అభినందించారు.

అథ్లెటిక్ ఓవరాల్ చాంపియన్‌గా నెక్స్ట్‌జెన్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన అండర్–12, 14 బాల బాలికల అథ్లెటిక్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నెక్స్ట్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ నిలిచింది. రన్నర్ అప్‌గా సింధూ హైస్కూల్ సాధించింది. అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ప్రసాద్, గారా శేషయ్య బహుమతి అందజేసినట్లు వివరించారు.

ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

ఆర్డీఓ షారోన్

రేపల్లె రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆర్డీఓ హెలా షారోన్ కోరారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పోలింగ్ సెక్టార్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై సెక్టార్, అసిస్టెంట్ సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, కేంద్రాలలో వసతులు, 200 మీటర్లలోపు రాజకీయ పార్టీల కార్యాలయాల వంటి వివరాలను తమకు నివేదించాలని ఆదేశించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని చెప్పారు. సెక్టార్ అధికారులు విస్తృతంగా పర్యటించి పూర్తి వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తిస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. గత ఎన్నికలలో వివిధ సందర్భాలలో అల్లర్లు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచి అవసరమైతే బైండోవర్ చేయాలని పోలీసులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నివేదికలను 10 రోజులలోగా అందించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ హెలా షారోన్

హత్య కేసులో ఆరుగురిపై కేసు

బాపట్ల: యువకుడి హత్య ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. సూర్యలంక రోడ్డులో మంగళవారం సుమంత్ హత్యకు గురైన విషయం తెలిసిందే. పాత కక్షల నేపథ్యంలో గతంలో యాసిన్‌పై సోను మరికొందరు దాడి చేశారు. పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకున్న ఇద్దరు కొంత కాలంగా ఎటువంటి వివాదం లేకుండా ఉంటున్నారు. అయితే మంగళవారం మధ్యాహ్నం సోను, రాహుల్, వెంకటసుమంత్ మరో ఇద్దరు కారులో వెళ్తుండగా యాసిన్ ఒక్కడే రోడ్డుపై వెళ్తున్న సమయంలో ఆపి పీకపై కత్తి పెట్టి దాడి చేసి వెళ్లిపోయారు. బాధితుడు స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో అందరూ కలిసి వెళ్లి రెస్టారెంట్ వద్ద ఉన్న కారును ధ్వంసం చేయడంతో గమనించిన సోను, మరో ఇద్దరు యువకులు పారిపోగా, రాహుల్, సుమంత్ దాడి చేయడానికి వచ్చిన వారిపై ఎదురు దాడి చేయడానికి ప్రయత్నం చేసి వినోద్ అనే వ్యక్తిని కత్తితో దాడి చేయడంతో మిగిలిన వారు కర్రలతో రాహుల్, సుమంత్‌పై దాడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. రాహుల్ చేతిలో ఉన్న కత్తి కింద పడడంతో వినోద్ అనే యువకుడు కత్తిని తీసుకొని రాహుల్‌పై దాడి చేయడంతో రాహుల్‌కి గాయాలు కాగా పారిపోయాడు. సుమంత్ పూర్తిస్థాయిలో దొరికిపోవడంతో కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఫిర్యాదు మేరకు వినోద్, యాసీన్, ప్రవీణ్, సతీష్, చిన్న వినోద్, అఖిల్ అనే వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడిస్తామని సీఐ పేర్కొన్నారు.



ధ్వంసమైన కారు

ముఖ్యమంత్రి స్ఫూర్తితో పేదలకు భరోసా

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో 663 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ


చేబ్రోలులో కళ్లజోళ్లు అందుకున్న వారితో అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో పేదలకు నేత్ర జ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగులకు చేయూతల ద్వారా భరోసా కల్పిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. జనవరి 26న చేబ్రోలు గ్రామంలోని ముట్లూరు–చేబ్రోలు రోడ్డు జంక్షన్ దగ్గర జరిగిన బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా జరిగిన బజరంగ్ 'నేత్రజ్యోతి' శిబిరంలో పాల్గొన్న 663 గ్రామస్తులకు వ్యక్తిగత కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించడంతో బుధవారం వారికి ఉచితంగా కళ్లజోళ్లను మురళీకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజసేవే పరమావధిగా భావిస్తూ పేదలకు ఆరోగ్యపరంగా అండగా ఉంటున్నట్లు తెలిపారు. నేత్ర సమస్యలతో బాధపడే వారికి ఊరట కలిగించి, వారి చీకట్లను పారద్రోలి, తిరిగి వెలుగులను ప్రసాదించేందుకు బజరంగ్ నేత్ర జ్యోతి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పనిచేస్తోందన్నారు. 'జగనన్న సంక్షేమ పాలన' ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.

ధాన్యం, బియ్యం నిల్వలు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయండి

నరసరావుపేట: ధాన్యం, బియ్యం నిల్వలను ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వ్యాపారులను కోరారు. కలెక్టరేట్‌లో బియ్యం వ్యాపారులు, రిటైలర్లు, ప్రాసెసర్లు, మిల్లర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారితో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రభుత్వ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు బియ్యం, నూకలు, బాస్మతి కాని తెల్లబియ్యం, పారా బాయిల్‌రైస్, బాస్మతి బియ్యం నిల్వలను ప్రతి శుక్రవారం సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు.

సమష్టి కృషితో 'నులి'మేద్దాం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమం సమష్టి కృషితో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల మధ్య ఉన్న వారు 4,72,534 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ ఆల్బెండాజోల్ మాత్రలను ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెట్ పాఠశాలలోపాటు పాటు అంగన్‌వాడీ, కళాశాలల్లో మింగించాలన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్రను నీళ్లల్లో కలిపి తాగించాలన్నారు. 2–19 సంవత్సరా పిల్లలకు ఒక మాత్ర వేయాలని చెప్పారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

నవరత్నాలు–సంక్షేమ పథకాల్లో భాగంగా పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ మరింత వేగంగా చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 9 సాయంత్రానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో సుమారు 1.40 లక్షల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను ఈ నెల 15లోపు పంపిణీ చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా పాల సేకరణ ఈ నెల 15 నుంచి ప్రారంభించాలన్నారు.

డీ వార్మింగ్ డేను జయప్రదం చేయండి
జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుబ్బరాజు

ప్రత్తిపాడు: డీ వార్మింగ్ డేను జయప్రదం చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.వి. సుబ్బరాజు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. హాజరైన డీఐవో సుబ్బరాజు, జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవిలు వైద్యాధికారులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులందరికీ కచ్చితంగా ఆల్బెండజోల్ మాత్రలను అందించేలా పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్యశాఖ సిబ్బంది విద్యాశాఖ, పంచాయతీరాజ్ సిబ్బందితో కలిసి సమన్వయం చేసుకుంటూ ప్రతీ విద్యార్థికి మాత్రలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కోరారు. డీపీవో మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు నులిపురుగుల నివారణ ఎంతో ముఖ్యమన్నారు. నులిపురుగుల కారణంగా రక్తహీనత, నీరసం, కడుపునొప్పి, వాంతులు, బరువు తగ్గడం వంటి ఎన్నో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి మండలంలో 9 వేల మంది విద్యార్థులున్నారని, విద్యాశాఖ సహకారంతో వారందరికీ రేపు మాత్రలను అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యమేఘన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రతో సమస్యలను అధిగమించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమాదేవి, లీలారాణి, డాక్టర్ స్రవంతి, సీహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

బాలోత్సవాన్ని విజయవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల అభిరుచి, ఆసక్తికి అనుగుణంగా సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసి, జ్ఞానతృష్ణను ప్రోత్సహించేందుకు ఈనెల 17,18వ తేదీల్లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బుధవారం మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో బాలోత్సవం బ్రోచర్ విడుదల చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొనేందుకు పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. బాలోత్సవం కన్వీనర్లు ఎం. బోసుబాబు, కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 25 రకాల అంశాలపై జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్ పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలను అన్ని పాఠశాలలకు పంపుతున్నామని, పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు పాఠశాలలకు ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హిందూ కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, చావా శ్రీనివాస్, టి. జాన్‌బాబు, జి. వెంకట్రావు, పీవీ మల్లేశ్వర్, వెంటరెడ్డి, కె.శ్రీదేవి, ఎస్‌ఎం సుభానీ, ఎం. ఉదయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


బాలోత్సవం బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రామకృష్ణమూర్తి, పీఎం ప్రసాద్

వైఎస్ జగన్‌కు ముస్లిం మైనార్టీలు అండగా ఉండాలి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన సిరాజ్ ఉర్ రెహ్మాన్

సత్తెనపల్లి: ముస్లిం మైనారిటీల సంక్షేమానికి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశేషమైన కృషి చేశారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం రాత్రి 'శాంతి సందేశం ఫౌండేషన్' వ్యవస్థాపకుడు, ముస్లిం ప్రబోధకుడు బ్రదర్ సిరాజ్ ఉర్ రెహ్మాన్ నిర్వహించిన 'సమాజ సంస్కరణ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పట్టణంలో ముస్లింల కోసం రూ.9 కోట్ల విలువ చేసే 25 సెంట్ల స్థలాన్ని మసీదు కోసం కేటాయించినట్లు చెప్పారు. షాదీఖానా నిర్మాణానికి రూ.కోటి, ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు నిధులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నకరికల్లు మండలం గుండ్లపల్లిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు, రాజుపాలెం మండలం కొండమోడులో రూ.3 కోట్లు విలువ చేసే అర ఎకరా ప్రభుత్వ స్థలం ముస్లిం కమ్యూనిటీ హాల్ కొరకు అందించామన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు సిరాజ్ మాట్లాడుతూ ముస్లిం అంటే మతం కాదని మానవత్వం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పట్టణ అధికార ప్రతినిధి ఎస్‌ఎం యూనస్, షేక్ జానీ పాల్గొన్నారు.

బాలికల హక్కుల పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

అమరావతి: సమాజంలోని బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. మండల పరిధిలోని అత్తలూరు గ్రామ సచివాలయంలో బాలికల హక్కుల అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పెదకూరపాడు, అమరావతి మండలాల మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామసర్పంచులు హాజరయ్యారు. సదస్సుకు క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పి.స్వర్ణకుమారి అధ్యక్షత వహించారు. పద్మావతి మాట్లాడుతూ బాలికలు ధైర్యంగా ఉండి తమ హక్కులను వినియోగించుకోవాలన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన పోలీస్‌శాఖ బాలికలకోసం రూపొందించిన కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. నేటి సమాజంలో బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులతో పాటు పౌరులందరిపైనా ఉందని చెప్పారు. బాల్య వివాహ నిషేధ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాలలో మహిళా సంరక్షణ కార్యదర్శులు నిరంతరం బాల్యవివాహాలపై బాలికల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మంచిస్పర్శ, చెడు స్పర్శ గురించి బాలికలకు వివరించాలన్నారు. ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి బాలికల కోసం పోక్సో, దిశ, విద్యా హక్కు చట్టాల అమలు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సులో ఎంఈఓలు శ్రీనివాసరావు, శివబాబు, ప్రసాదరావు, అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రవిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఇమాంబి, భారతీదేవి, ఎస్‌కే మున్నా, ఎస్ఐ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి

వినుకొండ(నూజెండ్ల): బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన వినుకొండ మండలం పిట్టంబండలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఉమ్మడివరానికి చెందిన పెడతల చంద్రశేఖర్(18) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా పిట్టంబండ సమీపంలో చేరుకోగానే ఎదురుగా వస్తున్న టిప్పర్, బైక్‌ను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించే లోపే చంద్రశేఖర్ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

10,11 తేదీల్లో కొండవీడు ఫెస్ట్


కలెక్టరేట్‌లో కొండవీడు ఫెస్ట్‌కు చెందిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

జిల్లా కలెక్టర్ శివశంకర్


నరసరావుపేట: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొండవీడు కోటని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈనెల 10, 11 తేదీల్లో కొండవీడు ఫెస్ట్–2024ను నిర్వహణ సందర్భంగా ఫెస్ట్‌కు చెందిన పోస్టర్ ఆవిష్కరించారు. హెలి రైడ్, సాంస్కృతి కార్యక్రమాలలో పాల్గొనదలచిన వారు హెలి రైడ్ 6–7 నిమిషాలకు ఒక్కొక్క టికెట్ రూ.4,500గా నిర్ణయించామన్నారు. దీనికోసం తంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన మహేష్ 74834 32752 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనదలచిన వారు డి.రేవతి 94406 42122 సంప్రదించాలని కోరారు. గెలిచిన వారికి ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతిగా రూ.5,116 అందజేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా పారా మోటరింగ్ సంబంధించి టికెట్ ధర రూ.2 వేలు, హాట్ ఎయిర్ బెలూన్ రూ.500లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పారా మోటరింగ్‌కి సంబంధించి వంశీ నంబరు 98868 62985 సంప్రదించి, ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్ఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

మాతృమరణాలు తగ్గించేందుకు హెల్త్‌క్లబ్‌లు

నరసరావుపేట: మాతృ మరణాలు రక్తహీనత వలన జరగవచ్చునని, వీటిని నివారించేందుకు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో గర్భిణులలో హిమోగ్లోబిన్ శాతం పెంపొందించేందుకు హెల్త్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ సూచించారు. కలెక్టరేట్‌లో మాతృ మరణాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. మాతృ మరణాలు చోటుచేసుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన చంద్రాజుపాలెం, నాదెండ్ల, యడ్లపాడు, దుర్గి నుంచి ప్రైవేట్, ప్రభుత్వ గైనకాలజిస్టులు, సిబ్బంది హాజరయ్యారు. వారితో మాతృమరణాలకు గల కారణాలను విచారించి వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. రక్తహీనతను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పోషకాహారం, యోగా, ఎక్సర్ సైజులు ఉదయం, సాయంత్రం వేళల్లో అవగాహన ద్వారా కల్పించాలని వైద్యులకు సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, డీసీహెచ్ఓ డాక్టర్ బీవీ రంగారావు, సీడీపీఓ పీడీ ఉమారాణి పాల్గొన్నారు.

ఫైనాన్స్ సంస్థ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నాదెండ్ల: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల దౌర్జన్యానికి గురై ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వింజమూరి వెంకటరామయ్యను జిల్లా కన్జ్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ మురికిపూడి ప్రసాద్, సీపీఐ నాయకుడు ఎ.రామకృష్ణ బుధవారం పరామర్శించారు. ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు రుణాలు ఇచ్చే సమయంలో చెప్పే వడ్డీ రేట్లు, నిబంధనలు, రుణాలు వసూలు చేసే క్రమంలో అధిక వడ్డీ రేట్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. రుణగ్రస్తులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంకటరామయ్య కుటుంబానికి అండగా ఉంటామని, అతడిపై దౌర్జన్యం చేసిన సంస్థ సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు వివరించారు. అనంతరం జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ పిల్లి నారాయణకు వీడియో కాల్ ద్వారా బాధితుడికి భరోసా కల్పించారు. అప్పు ఇచ్చిన ఏ సంస్థ అయినా అప్పు తీసుకున్న వారిపై వ్యక్తిగత దాడులకు పాల్పడటం, సెల్ ఫోన్లు, గృహోపకరణాలను తీసుకెళ్లటం, బెదిరించటం, చెల్లింపులు, లావాదేవీలపైన తప్పుడు లెక్కలు చూపటం ఆర్‌బీఐ గైడ్‌లైన్స్‌కు విరుద్ధమన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడిన సంస్థ సిబ్బందిపై విచారణ జరిపి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.


ఆస్పత్రిలో వెంకటరామయ్యను పరామర్శిస్తున్న దృశ్యం